# మానవ హక్కులు

మూలం:

సయ్యద్ అబుల్ ఆలా మౌదూది

అనువాదం:

అబ్దుల్ వాహెద్

అనంతకరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

# మానవ హక్కులు

ఇస్లామ్‌కు సంబంధించినంత వరకు ప్రాథమిక మానవ హక్కుల భావన ఏమాత్రం కొత్తది కాదు. మానవహక్కుల భావన ఐక్యరాజ్యసమితి చార్టరుతోనో లేదా ఇంగ్లాండు ప్రకటించిన మాగ్నాకార్టా (Magna Carta)తోనో ఈ భావనకు అంకురార్పణ జరిగిందని ఇతరులు తలపోయవచ్చు. కాని ముస్లిముల్లో ఈ భావన అంతకు పూర్వం నుంచే ఉంది. మానవ హక్కుల గురించి ఈ వివరాలను మీ ముందుంచే ముందు మానవ హక్కుల భావన ఎలా మొదలయ్యిందో ఆ చరిత్రను తెలుపడం అవసరమనుకొంటున్నాను.

ప్రాథమిక మానవహక్కులు ఏవి? అన్న మానవులకు సంబంధించిన ప్రశ్న స్వయంగా మానవుల మధ్యనే మాటిమాటికీ తలెత్తుతూ రావడం విచిత్రంగా లేదూ? ఒక్క మనిషి తప్ప మిగిలిన ప్రాణికోటికి - ఈ ప్రపంచంలో నివసిస్తున్న జీవజాలానికంతటికీ - వాటి హక్కులను స్వయాన విశాల ప్రకృతే అనుగ్రహించింది. తమ హక్కుల కోసం ప్రపంచంలోని జంతువులేవీ ఆలోచించ నవసరం లేకుండానే ఆ హక్కులు ఆ జీవజాలానికి ప్రకృతిసిద్ధంగానే లభ్యమవుతున్నాయి. కాని, మనిషి విషయం వచ్చేసరికి ఇతగాడి హక్కులు ఏవి? అన్న ప్రశ్న ముందుకువస్తుంది. కాగా ఆ హక్కులను నిర్ధారించవలసిన అవసరం కూడా ఏర్పడుతూంది.

అంతే విచిత్రమైన మరో విషయమేమంటే, మనిషి సాటి మనిషితో జరిపే వ్యవహారం ప్రపంచంలోని జంతువు ఏదీ మరో జంతువుతో జరపదు. జంతువుల్లో ఏ జీవరాశి అయినా కేవలం అధికార కాంక్షతో మరో జీవరాశిపై దాడి చేసి దాన్ని లొంగదీయాలని, తన అధికారాన్ని స్థాపించాలని ప్రయత్నించడం కూడా కనబడదు.

దైవనియమావళి ప్రకారం ఏ జంతువుకయినా మరో జంతువు ఆహారంగా చెయ్యబడడం వల్ల మాత్రమే కేవలం ఆహారం కోసం అది మరో జంతువుపై దాడి చేస్తుంది. ఆహారం కోసం కాకుండా ఆకలి తీరిపోయిన తరువాత, అకారణంగా సాటి జంతువులను చంపివేస్తూ ఉండే మృగమేదీ లేదు. అంతేకాదు, మనిషి మరో మనిషితో ప్రవర్తించినట్లు జంతువులు తమ జాతి జంతువుతోనూ ప్రవర్తించవు. మనిషిలోని ఈ ప్రవర్తనకు కారణం బహుశ దైవం మనిషిని అనుగ్రహించిన విశిష్టత, మహత్తుల ఫలితమేమో! దైవం అనుగ్రహించిన బుద్ధిబలం, ఆవిష్కరణా శక్తి చూపే మహత్యమేమో, మనిషి ఈ అసాధారణ ధోరణినవలంబిస్తున్నాడు.

ప్రపంచంలో నేటి వరకు పులులు ఏ సైన్యాన్నీ ఏర్పరచలేదు. కుక్కలలో ఏదీ నేటి వరకు సాటి కుక్కల్ని బానిసలుగా మార్చలేదు. కప్పలు సాటి కప్పల గొంతు నులిమిన ఆధారాలు లేవు. కేవలం మానవుడు మాత్రమే దైవాదేశాలను త్రోసిరాజని ఆయనిచ్చిన శక్తియుక్తులను మటుకు ఉపయోగించడం మొదలెట్టగానే సాటి మానవులపై అత్యాచారాలకు ఒడిగడుతున్నాడు. భూమిపై మనిషి పుట్టినప్పటి నుంచి నేటివరకు మృగాలు చంపిన మనుష్యులకన్నా కేవలం రెండో ప్రపంచయుద్ధంలో మనుషులు చంపివేసిన మనుష్యులే ఎక్కువ. దీనివల్ల మనిషికి సాటి మనుషుల ప్రాథమిక హక్కులపట్ల ఏ అవగాహనా లేదని రుజువవుతోంది. ఆ ఒక్క దైవమే ఈ విషయంలో మనిషికి మార్గం చూపాడు. తన ప్రవక్తల ద్వారా మనుష్యులకు మానవహక్కులను గురించి ఎరుకపరిచాడు. వాస్తవానికి మానవ హక్కులు ఏవో నిర్ణయించగలిగినవాడు సకల చరాచర సృష్టికి కర్త ఒక్కడే. అలాగే ఆ సృష్టికర్త మానవ హక్కులు ఏవో విశదంగా తెలియపరిచాడు కూడా.

## మానవ హక్కుల చైతన్యం, పరిణామక్రమం

మానవ హక్కుల ఇస్లామీయ భావనను వివరించే ముందు, ఆధునిక కాలంలో మానవ హక్కుల గురించిన చైతన్యం ఎప్పుడు ఆరంభమైనదో దాని

పరిణామ చరిత్రను సంగ్రహంగానయినా చూడటం సముచితమనుకొంటాను.

1. ఇంగ్లాండ్‌లో కింగ్‌జాన్ క్రీ.శ. 1215లో జారీ చేసిన మాగ్నా కార్టా వాస్తవానికి అతడి దర్బారీల (Barons) ఒత్తిడి ఫలితంగా జారిఅయ్యింది. ఈ మాగ్నాకార్టా రాజుకు, దర్బారీలకు మధ్య ఓ ఒప్పందం వంటిది మాత్రమే. అందులోనూ దర్బారీలకే అధిక ప్రయోజనకారిగా అది తయారుచేయబడింది. సాధారణ ప్రజల హక్కుల ప్రసక్తి అందులో ఎంతమాత్రం లేదు. అయితే తరువాత కాలంలో కొందరు మాగ్నాకార్టాకు వివిధ భాష్యాలు చెప్పారు. వాస్తవానికి అవి ఏవీ మాగ్నాకార్టాను రూపొందించిన వాళ్ళ దృష్టిలో లేవు. వారికి ఈ క్రొత్త అర్థాలు తెలిపితే వారు ఆశ్చర్యచకితులయ్యేవారు. 17వ శతాబ్దపు న్యాయనిపుణులు ఈ మాగ్నాకార్టాలో ఇంగ్లండు పౌరులకు, జ్యూరీ విచారణను కోరే హక్కు, అక్రమ నిర్బంధాన్ని ప్రతిఘటించే (Right of Habeas Corpus) హక్కులు ఉన్నాయని, పన్నులు విధించే అధికారాలను నియంత్రించే హక్కులున్నాయని కూడా భాష్యం చెప్పారు.

2. టాంపేన్ (Tom Pain 1737 - 1809) ప్రచురించిన చిరుపుస్తకం 'మానవ హక్కులు' (Rights of Man) పాశ్చాత్యుల ఆలోచనా సరళిపై తీవ్ర ప్రభావాన్ని వేసింది. 1791లో ఆయనే వ్రాసిన మరో పుస్తకం పాశ్చాత్య దేశాలలో మానవ హక్కుల భావన విస్తృతం అయ్యేలా చేసింది. టాంపెన్ దైవబోధిత ధర్మాన్ని అంగీకరించే వ్యక్తికాదు. పైగా దైవధర్మాన్ని ఎదిరించే రోజులవి. ఫలితంగా దైవధర్మాల్లో మానవ హక్కుల భావనకు చోటు లేదేమో అని ప్రజలనుకున్నారు.

3. ఫ్రాన్స్ విప్లవ గాథలో ముఖ్యమయిన అధ్యాయం, మానవహక్కుల ప్రకటన (Declaration of the Rights of Man). ఈ ప్రకటన 1789లో వెలువడింది. ఇది 18వ శతాబ్దపు సామూహిక ఆలోచనలకు, ముఖ్యంగా రూసో ప్రతిపాదించిన సామాజిక ఒప్పందమనే సిద్ధాంతానికి (Social Contract Theory) ప్రతిఫలంగా రూపొందింది. ఈ ప్రకటనలో జాతి ప్రభుసత్తా,

స్వాతంత్ర్యం, సమానత్వం, యాజమాన్యపు సహజమైన హక్కుల్ని పొందుపరచడం జరిగింది. ఇందులో ఓటుహక్కు, శాసన నిర్మాణం, పన్నులు విధించే అధికారాలపై జనసామాన్య నియంత్రణ, జ్యూరి సభ్యుల ముందు నేరవిచారణ జరగాలని కూడా పేర్కొనడం జరిగింది.

ఈ మానవహక్కుల ప్రకటనను ఫ్రాన్సు రాజ్యాంగనిర్మాణ సభ ఫ్రెంచి విప్లవ కాలంలో తయారుచేసింది. సంవిధానం తయారు చేస్తే దాని ఆరంభంలో దీన్ని చేర్చాలని, రాజ్యాంగ నిర్మాణంలో దీని మూలభావాన్ని దృష్టిలో పెట్టుకోవాలన్న ఉద్దేశ్యంతో దీన్ని రూపొందించారు.

4. బ్రిటన్ ప్రజాస్వామ్యతత్వంపై ఆధారపడిన హక్కులు చాలా వరకు అమెరికా సంయుక్త రాష్ట్రాల పది రాజ్యాంగ సవరణల్లో చేర్చబడ్డాయి.

5. 1948లో బగోటా సమావేశంలో అమెరికా రాష్ట్రాలు అంగీకరించిన మానవహక్కులు, బాధ్యతల ప్రణాళికకు కూడా చాలా ప్రాముఖ్యం ఉంది.

6. ప్రజాస్వామ్యతత్వం ఆధారంగానే ఐక్యరాజ్యసమితి ఒక్కొక్కటిగా అనేక హక్కులు, అనేక రక్షణ ప్రధానమయిన హక్కులను గురించి తీర్మానాలను ఆమోదించింది. చివరకు అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన వెలువడింది.

1946 డిసెంబర్‌లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ఒక తీర్మానాన్ని జారీచేసింది. ఆ తీర్మానంలో ఒక వర్గ సామూహిక హత్యాకాండ (Genocide)ను అంతర్జాతీయ చట్టాల ప్రకారం నేరంగా పేర్కొనడం జరిగింది.

1948లో జాతి హత్యాకాండను నిరోధించడానికి, శిక్షించడానికిగాను మరో తీర్మానాన్ని ఆమోదించింది. 1951 జనవరి 12న ఆ తీర్మానాన్ని జారీ చెయ్యడం జరిగింది. ఈ తీర్మానంలో జాతి హత్యాకాండను నిర్వచిస్తూ క్రింద పేర్కొన్న చర్యలలో ఏ ఒక్క చర్యద్వారా అయినా సరే ఏదైనా జాతీయ లేదా వర్ణపరమైన లేదా నైతిక వర్గాన్ని లేదా దాని ఓ భాగాన్ని నాశనం చేయగోరడం అని సూచించడం జరిగింది.

## ఆ చర్యలు

1. అలాంటి వర్గంలోని ప్రజలను చంపడం.
2. వారిని శారీరకంగాగాని, మానసికంగాగాని తీవ్రంగా గాయపరచడం.
3. ఆ వర్గప్రజలపై సంకల్పితంగా దాని భౌతిక ఉనికికి పూర్తిగా లేక పాక్షికంగా నాశకరమయిన జీవనస్థితుల్ని బలవంతాన రుద్దడం.
4. ఆ జాతి ప్రజలలో సంతాన నిరోధక చర్యల్ని బలవంతంగా గైకొనడం.
5. ఆ జాతి సంతానాన్ని బలవంతాన మరో జాతిలోకి మార్చడం.

1948 డిసెంబర్ 10న జారీ అయిన అంతర్జాతీయ మానవహక్కుల ప్రకటనలోని పీఠికలో ఇతర అంశాలతోపాటు క్రింది సంకల్పాలు కూడా ప్రకటించబడ్డాయి.

"ప్రాథమిక మానవ హక్కుల్లో, మనిషి వ్యక్తిగత గౌరవం ప్రాధాన్యతలలో, స్త్రీ పురుషుల సమాన హక్కుల్లో విశ్వాసాన్ని ధృవపరిచేందుకు...." అని ఉంది.

అంతేకాదు, అందులో ఐక్యరాజ్యసమితి లక్ష్యాలలో ఒకటిగా ఈ అంశాలని కూడా పేర్కొనడం జరిగింది:

"మానవహక్కుల పట్ల మన్ననను స్థాపించడానికి, జాతి, లింగం, భాషా, మతం ఆధారంగా విచక్షణలకు అతీతంగా మానవులందరికీ ప్రాథమిక స్వేచ్ఛలు ఇప్పించే కార్యంలో అంతర్జాతీయ సహాయ సహకారాలను పొందడం."

అలాగే 55వ ప్రకరణంలో ఐక్యరాజ్యసమితి ప్రకటన ఇలా పేర్కొంటుంది: "ఐక్యరాజ్యసమితి మానవహక్కులకు, అందరి మౌలిక స్వేచ్ఛలకు ప్రపంచ వ్యాప్తంగా మన్నన లభించేందుకు, ఈ హక్కుల సంరక్షణ మరింత పెరిగేలా ప్రయత్నిస్తుంది."

ఈ ప్రకటన యావత్తులో ఏ ఒక్క భాగాన్ని ఏ జాతి ప్రతినిధులూ విభేదించలేదు. విభేదించకపోవడానికి కారణం ఇది కేవలం సాధారణ సూత్రాల

ప్రకటన మాత్రమే గనక. దీనివల్ల ఎవరిపైనా ఏ విధమైన నిర్బంధం రాదు. ఇది ఎలాంటి ఒప్పందమూ కాదు - సంతకాలు చేసిన దేశాలన్నీ దానికి కట్టుబడి ఉండేందుకు, అలా చెయ్యకపోతే అంతర్జాతీయ చట్టాల ప్రకారం వీరిపై చర్యలు తీసుకోడానికి. ఇది ఒక ప్రామాణిక స్థాయి అని, దీన్ని అందుకోవడానికి ప్రయత్నించాలని ఈ ప్రకటనలో స్పష్టంగా పేర్కొనడం జరిగింది. పైగా కొన్ని దేశాలయితే ప్రకటనకు అనుకూలంగానో లేదా ప్రతికూలంగానో ఓటు వెయ్యకుండా తటస్థంగా ఉండిపోయాయి.

ఇప్పుడు పరిస్థితి ఏమిటీ? నేరుగా ఈ మానవ హక్కుల ప్రకటన ఛాయలోనే మానవాళికి అత్యంత ప్రాథమిక హక్కుల్ని గొంతునులిమి వెయ్యడం జరుగుతోంది. ఆధునిక అత్యంత నాగరిక, అగ్రదేశాలలోనే, ఈ ప్రకటనను ఆమోదించిన దేశాలలోనే ఇదంతా జరుగుతోంది.

ఈ సంక్షిప్తమయిన వివరణవల్ల తేలేదేమిటంటే, పాశ్చాత్య ప్రపంచంలో మానవహక్కుల భావన అన్నదే కేవలం రెండు మూడు శతాబ్దాల క్రితం పుట్టింది. అంతకు పూర్వం దానికి అక్కడ ఎట్టి చరిత్ర అంటూ లేదు. పోతే, నేడు మానవహక్కుల ప్రస్తావన అక్కడ వినబడుతున్నప్పటికీ వాటి వెనక సాధికార (Authority) ఆధారమేదీ లేదు. వాటిని జారీ (Sanction) చెయ్యగల శక్తీ ఏదీ లేదు. ఇవి కేవలం అందమయిన కోరికలు మటుకే.

అయితే, దీనికి భిన్నంగా ఇస్లాం ఖుర్‌ఆన్‌లో ప్రతిపాదించిన మానవ హక్కులు, దానికి మహాప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన ఆఖరి హజ్‌లో చేసిన ప్రకటన పాశ్చాత్యులు పేర్కొనే మానవ హక్కుల భావనకన్నా ప్రాచీనమైనది. ఇస్లామీయ సమాజానికి విశ్వాసంరీత్యా, నైతికంగా, ధార్మికంగా విధిగా అనుసరణీయం కూడా. ఈ మానవ హక్కులను ఆచరణాత్మకంగా నెలకొల్పిన అద్వితీయమైన ఉదాహరణలు మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఆ తరువాత ఆయన ఖలీఫా (రజి)ల జీవిత చరిత్రల్లో అనేకమున్నాయి.

ఇస్లాం మానవాళికి ప్రసాదించిన హక్కులేమిటో సంక్షిప్తంగా పరిశీలద్దాము.

## జీవించే హక్కు

ప్రపంచంలో ప్రప్రథమంగా జరిగిన హత్య సంఘటనను ఖుర్ఆన్ ప్రస్తావించింది. మానవ చరిత్రలో ఓ మనిషి మరో మనిషి ప్రాణాలు తీసిన మొట్టమొదటి దుర్ఘటన ఇది. మానవునికి మానవప్రాణాల గౌరవాన్ని తెలియ జేయవలసిన అవసరం అప్పుడే మొదటిసారిగా ఏర్పడింది. అప్పుడే ప్రతిమనిషికీ జీవించే హక్కు ఉందన్న సత్యాన్ని మనిషికి తెలియజెప్పవలసి వచ్చింది. ఆ దుర్ఘటనను ప్రస్తావించిన అనంతరం ఖుర్ఆన్ ఇలా బోధిస్తుంది:

"ఒక మనిషి ప్రాణాలు తీయడమన్నది హత్యచేసినందుకు గాని లోకంలో కల్లోలం రేకెత్తించినందుకుగాని కాకపోతే అలా చేసినవారు మానవులందర్ని చంపినట్లే. మరెవరయితే ఒక మానవుణ్ణి జీవించనిస్తాడో అతడు మానవులనందరినీ జీవించనిచ్చినట్లే." *(అల్ మాయిద : 32)*

ఈ దైవవాక్యంలో ఒక మానవుని హత్యను యావత్ మానవాళి హత్యగా అభివర్ణించింది ఖుర్ఆన్. అంతేకాదు, ఒక మనిషి ప్రాణాలను కాపాడడాన్ని యావత్ మానవాళిని కాపాడడంగా పేర్కొంది. అరబ్బీలో ఉన్న మూల వాక్యంలో 'అహ్యా' అన్న పదం ప్రయోగించబడింది. ఈ పదానికి జీవింపచేయడం అని అర్థం. మరోవిధంగా చెప్పాలంటే, ఒక మనిషి ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించిన వ్యక్తి మానవునికి ప్రాణం పోసినట్టే. ఆ ప్రయత్నాన్ని మానవతనంతటినీ బ్రతికించిన దానికి సమానంగా ఎంచడం జరిగింది.

ఈ ఆయతులో కేవలం రెండు మినహాయింపులు ఉన్నాయి.

మొదటిది: హత్యానేరానికి పాల్పడిన వ్యక్తిని రక్తపరిహారంగా పరిమార్చడం.

రెండు: భూమిపై ఉపద్రవాన్ని రేకెత్తించినట్లయితే ఆ వ్యక్తిని అంతమొందించడం.

ఈ రెండు పరిస్థితులలో వినా మనిషి ప్రాణాలను తీయడానికి వీలు లేదు.★

మానవ ప్రాణాలను సంరక్షించే ఈ నియమాన్ని దైవం మానవచరిత్ర ఆరంభకాలంలోనే విశదీకరించాడు. మనిషి అజ్ఞానాంధకారంలో పుట్టాడనీ, సాటి మనుష్యులను చంపుకుంటూ వచ్చి ఒకానొక దశలో తోటి మనిషిని చంపడం తగదని తలపోశాడని భావించడం పొరబాటు. ఇలాంటి భావనలు ఎంతమాత్రం సరయినవి కావు. దైవం పట్ల దురభిప్రాయం ఆధారంగా ఏర్పడిన భావనలివి. ఖుర్ఆన్ ప్రకారం దైవం ఆరంభకాలంలోనే మానవాళికి మార్గనిర్దేశన చేశాడు. మనిషికి మానవహక్కుల పట్ల ఎరుక పరచడం కూడా ఈ మార్గనిర్దేశనలోని అంతర్భాగమే.

## వికలాంగులు, బలహీనుల సంరక్షణ

ఖుర్ఆన్ ద్వారా అవగతమయ్యే, మహనీయ ముహమ్మద్ (సఅసం) ప్రవచనాల ద్వారా విశదమయ్యే మరో ముఖ్య విషయం ఏమిటంటే, స్త్రీలు, బాలలు, వృద్ధులు, క్షతగాత్రులు, వ్యాధిగ్రస్తులపై ఎట్టిపరిస్థితులలోనూ చేయిచేసుకోరాదు - వారు సొంత ప్రజలయినా శత్రుజనులైనా. అయితే యుద్ధంలో ఇలాటి వాళ్ళు స్వయాన తలపడుతున్నప్పుడు తప్ప మరే స్థితిలోనూ వారిపై చేయి చేసుకోవడం నిషిద్ధం. ఈ నియమం స్వకీయులకు మాత్రమే పరిమితం కాదు. యావత్ మానవాళిపట్ల ఈ నియమాన్నే పాటించాలి. ప్రవక్త మహనీయులు (సఅసం) ఈ విషయమై స్పష్టమైన ఆదేశాలిచ్చారు. సన్మార్గగాములయిన ఖలీఫాలు, తమ సైన్యాన్ని యుద్ధరంగానికి పంపుతున్న

★ *ఇంకా "దైవం నిషేధించి కాపాడిన ప్రాణాన్ని, ధర్మం ఆధారంగా తప్ప, సంహరించకండి." (ఖుర్ఆన్ - 17 : 33) అన్న ఆయత్‌ని కూడా పరిశీలించాలి.*

ప్పుడు సైనికులందరికీ ఈ విషయమై స్పష్టమైన ఆదేశాలిచ్చి శత్రువులపై దాడిచేస్తున్నప్పుడు ఆడవారు, పిల్లలు, ముసలివారు, రోగులు, గాయపడ్డవారిపై చేయెత్తరాదని హెచ్చరించి పంపేవారు.

## మహిళల మానమర్యాదల సంరక్షణ

స్త్రీ శీలం ఎట్టిపరిస్థితుల్లోనూ పవిత్రమయిందన్న సూత్రప్రాయమయిన హక్కు దివ్య ఖుర్‌ఆన్ ద్వారా మనకు తెలుస్తోంది. ప్రవక్త ప్రవచనాలలో దాని వివరాలున్నాయి. యుద్ధంలో శత్రువర్గానికి చెందిన మహిళలు కూడా చేజిక్కితే వారిని ముట్టుకోవడం ముస్లిం సైనికులకు ధర్మసమ్మతం కాదు. ఖుర్‌ఆన్ ప్రకారం వ్యభిచారం ఎట్టి పరిస్థితిలోనూ పూర్తిగా నిషిద్ధం. ఆ స్త్రీ ఎవరయినా సరే - ముస్లిం అయినా, కాకపోయినా లేక తన జాతికి చెందినదయినా వేరే జాతికి చెందినదయినా, మిత్ర దేశానికి చెందినదయినా, శత్రు దేశస్థురాలైనా.

## ఆర్థిక సంరక్షణ

ఒక మౌలిక నియమం ఏమిటంటే ఆకలిగొన్నవాడు ఎట్టి పరిస్థితులలో అయినా సరే అన్నానికి అర్హుడు. కట్టుబట్టల్లేని వాడు వస్త్రాలకు అర్హుడు. గాయపడినవాడు, వ్యాధిగ్రస్తుడు వైద్య సహాయానికి అర్హుడు. ఈ వ్యక్తులు - అన్నార్తులు, వస్త్ర హీనులు, గాయపడినవాళ్ళు, వ్యాధిగ్రస్తులు - శత్రువులైనా, మిత్రులైనా ఎవరైనా సరే. ఇది విశ్వజనీనమైన హక్కుల్లో ఒకటి. అందువల్ల శత్రుజాతి వ్యక్తి ఎవడయినా పట్టుబడినప్పుడు అతనికి అన్నవస్త్రాల సదుపాయాన్ని కలిగించడం ముస్లిముల బాధ్యత. అలాగే అతను గాయపడి, లేదా రోగగ్రస్తుడై ఉంటే అతనికి చికిత్స చేయించడం కూడా విధియే.★

---

★ *'వారి సంపదల్లో అర్థించేవాడికి, ఉపేక్షితుడికి హక్కుంది.' (ఖుర్‌ఆన్ 19 : 51)*

*'వారు ప్రేమతో నిరుపేదలకు, అనాధలకు, బంధితులకు భోజనాలు పెడతారు.'*

*(ఖుర్‌ఆన్ -76 : 8)*

## న్యాయబద్ధ వ్యవహారశైలి

మనిషిపట్ల న్యాయబద్ధంగా వ్యవహరించాలన్నది ఖుర్‌ఆన్ విధించే తిరుగులేని నియమం. ఖుర్‌ఆన్‌లో దైవం ఇలా తెలియజేసాడు:

"(ఏదైనా) వర్గంతో ఉన్న వైరం మిమ్మల్ని ఆగ్రహానికి గురిచేసి న్యాయాన్ని త్యజించేలా చెయ్యరాదు. న్యాయం చేయండి. ఇది ధర్మనిష్ఠాపరాయణతకు కడు చేరువయినది." *(అల్ మాయిద : 8)*

ఈ ఆయత్‌ద్వారా ఇస్లాం ఈనియమాన్ని నిర్దిష్టపరిచింది - ఎట్టిపరిస్థితిలోనూ మానవునితో - వ్యక్తితో అయినా లేదా ఒక జాతితో అయినా - వ్యవహరించేటప్పుడు న్యాయాన్నే పాటించాలి. మిత్రులతో న్యాయబద్ధంగా వ్యవహరించడం, శత్రువులతో వ్యవహరించేటప్పుడు న్యాయసూత్రాన్ని విస్మరించడం ఇస్లాంలో ఏమాత్రం తగదు.

## మంచికి సహకారం, చెడుకు సహాయ నిరాకరణ

ఖుర్‌ఆన్ విధిస్తున్న మరో నియమమేమిటంటే, మంచిపనులలో, హక్కులు అందజేయడంలో ఎల్లరికీ తోడ్పాటు నందించాలి. చెడుపనులలో, అన్యాయ వ్యవహారాలలో ఎవరితోనూ సహకరించరాదు. చెడుకు పాల్పడేవాడు సొంత సోదరుడైనా అతనికి తోడ్పడరాదు. మంచిపనులు చేసేవాడు, శత్రువయినా అతనికి చేయూతనివ్వాలి. ఈ విషయంలో దైవం ఇలా అంటున్నాడు:

"మంచికీ, ధర్మనిష్ఠకూ సంబంధించిన పనుల్లో అందరితో సహకరించండి. మరయితే పాపకార్యాల్లో మటుకు ఎవరితోనూ సహకరించకండి."

*(అల్ మాయిద: 2)*

అరబి మూలవాక్యంలో ప్రయోగించబడిన 'బిర్ర్' అనే పదానికి కేవలం 'మంచి' అన్న అర్థమే కాక 'హక్కుల నందజేయడం' అని కూడా అర్థముంది. అంటే ఇతరులకు వారి హక్కులను ఇప్పించడంలోను, ధర్మపరాయణ కార్యాల

లోను ముస్లిములు అందరికీ సహాయపడాలి. ఖుర్‌ఆన్ విధిస్తున్న శాశ్వత నియమమిది.

## సమానత్వపు హక్కు

ఖుర్‌ఆన్‌లో ఉధృతంగా ప్రవచించబడిన మరోహక్కు మానవులంతా సమానులే అన్నది. ఎవరికైనా ఏదయినా మహత్తు ఉన్నట్లయితే అది అతని నైతికత దృష్ట్యా మాత్రమే. ఈ విషయంలో ఖుర్‌ఆన్ బోధించేదేమిటంటే -

"జనులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీ, పురుషుల జంటద్వారా పుట్టించాము. మిమ్మల్ని జాతులుగా, తెగలుగా విభజించింది మీరు ఒకరినొకరు గుర్తుంచుకోవడానికి. నిస్సందేహంగా మీలో అత్యధిక ధర్మనిష్ఠ గలవారే అత్యధిక ఆదరణీయుడు."

(49 : 13)

ఇందులో మొదటి విషయమేమంటే మానవులంతా ఒకే మూల ఆధారంగా పుట్టారు. విభిన్న జాతులు, వర్ణాలు, భాషలు వాస్తవానికి మానవాళి విభజనకు ఎంతమాత్రం సమంజసమయిన కారణాలు కావు.

రెండవ విషయమేమంటే, ఈ విభజనను దైవం కేవలం మానవుల పరస్పర పరిచయం కోసం చేశాడు. మరోవిధంగా చెప్పాలంటే ఒకే కులం, ఒకే జాతి, ఒకే తెగ ప్రజలకు మరొక దానిపై గర్వించదగ్గ ఆధిక్యత ఏదీ లేదు. తద్వారా వారు తమకు ఎక్కువ హక్కుల్ని కేటాయించుకొని, ఇతరులకు తక్కువ హక్కులివ్వలేరు. దైవం చేసిన ఈ విభజనలన్నీ - రూపాలు భిన్నంగా రూపొందించినా, భాషలు వేర్వేరు చేసినా, ఇవన్నీ ఎవరికీ గర్వకారణాలు కావు, ఇవి కేవలం మానవులు పరస్పరం గుర్తించుకునేందుకు మాత్రమే. మనుష్యులందరూ ఒకేవిధంగా ఉన్నట్లయితే వేర్వేరుగా గుర్తించడం సాధ్యమయ్యేది కాదు. అందువల్ల ఈ విభజనన్నది సహజం. కాని ఇతరుల హక్కుల్ని కాజెయ్యడానికి, అనుచితమయిన వివక్ష చూపడానికి మాత్రం కాదు. మనిషి గౌరవా

దరణలు అతని నైతికతపై ఆధారపడి ఉంటాయి. ఇదే విషయాన్ని ప్రవక్త ముహమ్మద్ (స) మరోవిధంగా చెప్పారు: మక్కా విజయం తరువాత తాను చేసిన ప్రసంగంలో ఆయన ఇలా సెలవిచ్చారు:

"అరబ్బునకు అరబ్బేతరునిపై ఎలాటి ఆధిక్యత లేదు. అలాగే, అరబ్బేతరునికి అరబ్బుపై ఆధిక్యత లేదు. తెల్లవానికి నల్లవానిపైగాని, నల్లవానికి తెల్లవానిపైగాని ఏవిధమైన ఆధిక్యత లేదు - నిష్ఠ, ధర్మపరాయణతల ఆధారంగా తప్ప. అలాగే వంశం ఆధారంగా కూడా ఎవరికీ ఎవరిపైనా ఆధిక్యత లేదు."

అంటే ఆధిక్యత అన్నది నీతీ నిజాయితీ, ధర్మపరాయణతలపై ఆధారపడి ఉంటుంది. మనుష్యులందరూ ఒకేలా జన్మిస్తారు. ఒకడు వెండితోనూ, మరొకడు రాయితోనూ, ఇంకొకడు మట్టితోనూ పుట్టటం లేదు. మానవులంతా సమానులే.★

## పాపపు పనులకు దూరంగా ఉండే హక్కు

మరో నియమం ఏమిటంటే, మనిషికి తప్పు చేయమని ఆజ్ఞాపించే వీలు లేదు. అలాగే అపరాధం చేసే ఆదేశం ఇచ్చినట్లయితే ఎవరికయినా దాన్ని పాటించడం తప్పనిసరీ కాదు, ధర్మ సమ్మతమూ కాదు. ఖుర్ఆన్ శాసనం రీత్యా, ఒక అధికారి తన క్రింద పనిచేసే వ్యక్తికి అధర్మమయిన పనులు చేయమని ఆదేశించినట్లయితే లేక ఎవరిపైనయినా అనుచితంగా చెయ్యి చేసుకోమన్నట్లయితే క్రింది ఉద్యోగి తన అధికారి ఆదేశాన్ని ఈ వ్యవహారంలో

---

★ *ఫిరౌన్ రాజ్యవ్యవస్థను ఖుర్ఆన్ మిధ్యాపరమయిందిగా ప్రకటించడానికి కారణాలలో ఒకటి, "వాస్తవానికి ఫిర్ఔన్ భువిలో తిరుగుబాటు చేశాడు, జనావళిని వర్గాలుగా విభజించాడు. అందులో ఒక వర్గాన్ని అణచివేసేవాడు." (ఖుర్ఆన్ - 28:4) అంటే ఇస్లాం సమాజంలో మానవుణ్ణి పై తరగతివారుగా, క్రింది తరగతివారుగా, పాలకులు, పాలితులుగా వర్గాల్లో విభజించడాన్ని సహించదని తెలుస్తోంది.*

పాటించడం ధర్మసమ్మతం కాదు. ఈ విషయమై ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా సెలవిచ్చారు:

సృష్టికర్త ధర్మ విరుద్ధమని, పాపపు కార్యాలని చెప్పిన విషయాలను చేయమని ఆదేశించే హక్కు ఎవరికీ లేదు. ఆ విధమైన ఆదేశాలిచ్చే వ్యక్తికి ఆదేశాలు ఇవ్వడమూ ధర్మవిరుద్ధమే, మరోవ్యక్తి ఆ ఆదేశాలను పాటించడమూ ధర్మ విరుద్ధమే.

## అత్యాచారి పట్ల విధేయత నిరాకరించే హక్కు

ఇస్లాంలో ఉన్న మరో మహోన్నతమైన సూత్రం ఏమిటంటే, అత్యాచారికి విధేయతను కోరే హక్కు ఎవరికీ లేదు. దివ్య ఖుర్‌ఆన్ ప్రకారం, దైవం హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలామ్‌ను పరమ నాయకునిగా నియమిస్తూ "నిన్ను మేము మానవాళికి నాయకునిగా నియమిస్తున్నాం" అన్నప్పుడు ఆయన దైవంతో "ఈ వాగ్దానం నా సంతానానికి వర్తిస్తుందా?" అని ప్రశ్నించారు. హజ్రత్ ఇబ్రాహీంకు జవాబుగా దైవం, "నా వాగ్దానం అత్యాచారం చేసేవారికి వర్తించదు" (2:142) అన్నాడు. ఇక్కడ వాగ్దానం అనే పదానికి మూలంలో 'అహద్' అనేపదం వాడబడింది. 'అహద్' అనే పదానికి ఇంగ్లీషులో లెటర్ ఆఫ్ అపాయింట్‌మెంట్ (Letter of Appointment)అన్న భావం సరిపోతుంది. తెలుగులో ఆదేశ పత్రం అని అనవచ్చు.

ఈ ఆయత్‌లో, అత్యాచారులకు ఇతరుల విధేయతను కోరే హక్కు లేదని దైవం తేటతెల్లం చేసాడు.★

ఇదే విషయమై ఇమామ్ అబూ హనీఫా (రహ్మతుల్లాహ్ అలైహ్) ఇలా సెలవిచ్చారు: "అత్యాచారి ముస్లింల నాయకుడయ్యేందుకు అర్హుడు కాడు.

★ *ఇంకా ఈ స్పష్టమయిన ఆయత్‌లను కూడా దృష్టిలో ఉంచుకోవాలి: 'మీరు అత్యాచారుల ఆదేశాలను పాటించకండి.' (ఖుర్‌ఆన్ - 26 : 151)*

ఇలాంటి వ్యక్తి గనుక నాయకుడైతే అతడికి విధేయత చూపడం విధికాదు. అతడిని కేవలం భరించడం జరుగుతుంది."

## రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనే హక్కు

మనిషి ప్రాథమిక హక్కుల్లో ఇస్లాం నిర్ణయించిన అతి ముఖ్యమైన హక్కు, సమాజంలోని వ్యక్తులందరూ ప్రభుత్వంలో భాగస్వాములు అన్నది. వ్యక్తులందరి సలహా సూచనల మేరకే ప్రభుత్వం ఏర్పడాలి. ఖుర్‌ఆన్ ప్రకారం: "దైవం వారికి-అంటే విశ్వాసులకు - భూమిపై ప్రాతినిధ్యం ఇస్తాడు." (24 : 55) ఇక్కడ 'వారికి' అని బహువచనాన్ని ప్రయోగించడం జరిగింది. కొందరికి మాత్రమే కాదు జాతి అంతటికీ ప్రాతినిధ్యం ఇవ్వడం జరుగుతోంది. ప్రభుత్వం ఓ వ్యక్తి లేదా, ఓ వంశం, లేదా ఓ వర్గం వారి గుత్త సొత్తు కాదు. ప్రభుత్వం పూర్తి సముదాయానికి చెందింది. వ్యక్తులందరి సలహా సూచనలతోనే ఉనికిలోకి వస్తుంది. ఖుర్‌ఆన్ ఇలా పేర్కొంటుంది:

"ఈ ప్రభుత్వ వ్యవహారాలు పరస్పర సలహా సంప్రదింపులతో నడుస్తాయి."★ (42 : 38)

ఈ విషయాన్ని ఖలీఫా ఉమర్ రజిఅల్లాహు అన్హు మాటలు మరింత స్పష్టంగా విశదీకరిస్తున్నాయి. "ముస్లిములతో సలహా సంప్రదింపులు జరపకుండా వారిని పరిపాలించే హక్కు ఎవరికీ లేదు. వాళ్ళు అంగీకరిస్తే వారిని పరిపాలించే వీలుంది. వాళ్ళు అంగీకరించకపోతే ప్రభుత్వాన్ని ఏర్పరచవీలులేదు."

ఈ ఆదేశాల రీత్యా ఇస్లాం ఒక ప్రజాస్వామిక, సలహా సంప్రదింపుల ప్రభుత్వం సంస్థాపించే నియమాన్ని నెలకొలుపుతుందని తెలుస్తోంది. కాని దురదృష్టం ఏమంటే చరిత్ర విభిన్న దశల్లో ముస్లింలపై రాజరిక వ్యవస్థలే రాజ్యమేలాయన్నది వేరే విషయం. ఇస్లాం ఇలాంటి రాజరిక వ్యవస్థలకు అనుమతి నీయలేదు. ఈ రాజరికాలు మన అవివేక చేష్టల పరిణామాలే!

---

★ *పాలనా వ్యవహారాలలో వారితో సంప్రతింపులు జరుపు. (ఖుర్‌ఆన్ - 3 : 150)*

## వ్యక్తిగత స్వేచ్ఛ

ఇస్లాంలో మరో నియమం ఏమిటంటే మనిషి వ్యక్తిగత స్వేచ్ఛను న్యాయంగా తప్ప పరిహరించే వీలులేదు. హజ్రత్ ఉమర్ ఈ విషయమై స్పష్టంగా ఇలా సెలవిచ్చారు: "ఇస్లాంలో ఒక వ్యక్తిని ధర్మబద్ధంగా తప్ప నిర్బంధించే వీలులేదు." అని స్పష్టపరిచారు. దీని అధారంగా నెలకొనే న్యాయ భావన నేటి పరిభాషలో 'చట్టబద్ధమయిన న్యాయవిచారణ' (Judicial process of Law) లాంటిదని చెప్పవచ్చు. అంటే ఎవరి స్వేచ్ఛనయినా పరిహరించడానికి అతడిపై నిర్దిష్టమైన ఆరోపణలుండాలి. న్యాయస్థానంలో బహిరంగంగా కేసుపెట్టి విచారణ జరపాలి. అతగాడికి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకొనేందుకు పూర్తి అవకాశాలు ఇవ్వాలి. ఇదంతా జరగకుండా ఏ చర్యనయినా న్యాయబద్ధమయిందని చెప్పలేము. ముద్దాయికి తన నిర్దోషిత్వం నిరూపించుకొనే అవకాశం ఈయకపోతే అది న్యాయం కాదన్నది సాధారణ జ్ఞానానికి (Common sense) కూడా అందే విషయం. ఓ వ్యక్తిని పట్టుకొని అతడికి తన నిర్దోషిత్వం నిరూపించుకొనే అవకాశాన్నీయక నిర్బంధించడం ఇస్లాంలో సాధ్యపడదు. న్యాయబద్ధంగా వ్యవహరించడం ఇస్లామీయ ప్రభుత్వానికి న్యాయవ్యవస్థకు తప్పనిసరి అని ఖుర్‌ఆన్ విధిగా నిర్ణయించింది.★

## ఆస్తి హక్కు

ఖుర్‌ఆన్ స్పష్టంగా వ్యక్తిగత ఆస్తుల భావనను ఒక హక్కుగా ప్రతిపాదిస్తుంది. "మీరు అన్యాయంగా ఒకరి సంపదనొకరు కబళించపద్దు" అని ఖుర్‌ఆన్ ఆదేశిస్తుంది.

---

★ మిమ్మల్ని ప్రజల మధ్య న్యాయ నిర్ణేతలుగా నియమించినప్పుడు మీరు న్యాయబద్ధంగా తీర్పులు చెయ్యండి. *(ఖుర్‌ఆన్ - 4:58)*

ఖుర్ఆన్, హదీస్ (ప్రవక్త ప్రవచనాలు), ఫికహ్ (ధర్మశాస్త్రం) అధ్యయనం చేస్తే స్పష్టంగా తేలేదేమిటంటే ఇతరుల సొత్తును కబళించే ఈ పద్ధతుల్ని అస్పష్టంగా ఉంచలేదు ఇస్లాం. ఈ నియమం ప్రకారం ఓ వ్యక్తి నుంచి అధర్మ పద్ధతిలో ఏ సొత్తునూ పొందవీలులేదు. ఏ వ్యక్తికయినా, ఏ ప్రభుత్వానికయినా చట్టాన్ని ఉల్లంఘించి స్వయాన ఇస్లాం స్పష్టపరచిన మూడు నిర్ణీత పరిస్థితుల్లో తప్ప ఒకరి సొత్తుపై చెయ్యివేసే హక్కు లేదు.

## మాన మర్యాదల రక్షణ

మానవుని మానమర్యాదల పరిరక్షణ జరగడం కూడా ఒక ప్రాథమిక హక్కు. ఖుర్ఆన్‌లోని హుజ్రాత్ సూరాలో ఈ హక్కు గురించిన పూర్తి వివరాలు ఉన్నాయి. ఉదాహరణకు :

(1) మీలో ఏ వర్గమూ మరొక వర్గాన్ని పరిహసించరాదు.

(2) మీరు ఒకరినొకరు యెగతాళి పేర్లతో పిలుచుకోరాదు.

(3) మీరు ఒకరి వెనుక మరొకరు పరోక్షనింద చేయరాదు.

అంటే, మనిషి మానమర్యాదలకు భంగం కలిగించే చర్యలు ఏవేవి కాగలవో వాటినన్నింటినీ వారించడం జరిగింది. ఓ వ్యక్తిని ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాగాని పరిహసించరాదని, యెగతాళిపేర్లు పెట్టరాదని, నిందించరాదని అతి స్పష్టంగా తెలుపడం జరిగింది. ఒక వ్యక్తి మానమర్యాదలను ఎవరూ పరిహరించకుండా ఉండే హక్కు అతనికి చట్టబద్ధంగా ఉంది. మాటల ద్వారాగాని, చేతల ద్వారాగాని అతనిపై అత్యాచారం జరగకుండా ఉండే హక్కు అతనికి ఉంది.

## వైయక్తిక జీవిత రక్షణ

ఇస్లాం ప్రతిపాదించే ప్రాథమిక హక్కుల రీత్యా ప్రతి మనిషికి తన వైయక్తిక జీవనాన్ని (Private Life) సురక్షితంగా ఉంచుకునే హక్కు ఉంది. ఈ విషయమై 'నూర్' సూరాలో స్పష్టమైన వివరాలు ఉన్నాయి.

"మీ సొంత ఇండ్లుకాని ఇండ్లల్లోకి, (ఇంటివారితో) పరిచయం పెంచుకోనంత వరకు ప్రవేశించకండి." *(24 : 27)*

హుజ్రాత్ సూరాలో "గోప్యాన్వేషణ చెయ్యకండి" అని ఆదేశించడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ప్రవచనం ప్రకారం: "మనిషికి తన ఇంట్లోంచి ఇతరుల ఇంటిలోకి తొంగిచూసే హక్కు లేదు." ప్రతి వ్యక్తికి, ఇతరులు చేసే గలాభానుండి, ఇతరులు తొంగిచూడకుండా, తన పనుల్లో ఇతరుల జోక్యం కలగకుండా భద్రంగా తన ఇంటిలో ప్రశాంతంగా జీవించే చట్టబద్ధమైన హక్కు ఉంది. మనిషి తన ఇంటిలో స్వేచ్ఛగా ఎలాంటి మొగమాటం లేకుండా మసలుకోడానికి అతని వ్యవహారాలు ఇతరుల కంటపడకుండా ఉండేందుకు అవకాశముండాలి. ఇంకా ఇతరుల ఉత్తరాన్ని చదవడం అలా ఉంచి, పైపైన దృష్టి సారించే అధికారం కూడా ఎవరికీ లేదు. మనిషి వైయక్తిక (Privacy) మనుగడను ఇస్లాం పూర్తిగా పరిరక్షిస్తుంది. ఇతరుల ఇంట్లో తొంగి చూడరాదని, ఇతరుల ఉత్తరాలను చూడరాదని గట్టిగా నిషేధిస్తుంది. అయితే ఏ వ్యక్తి అయినా ఏదైనా ప్రమాదకరమైన పనికి పాల్పడుతున్నట్లు విశ్వసనీయ మార్గాలద్వారా కచ్చితమైన సమాచారం అందిన పక్షంలో మినహాయింపు లభించవచ్చు. అలాకాని పక్షంలో ఇతరుల పరిస్థితులను గురించి ఆరాలు తీయడం ఇస్లామీయ షరీఅత్‌లో ధర్మసమ్మతం కాదు.

## దౌర్జన్యపరుణ్ణి వ్యతిరేకించే హక్కు

దౌర్జన్యానికి వ్యతిరేకంగా గొంతెత్తే హక్కు ఇస్లాం ప్రసాదించే ప్రాథమిక హక్కుల్లోనిది. ఈ విషయమై దైవం ఇలా పేర్కొన్నాడు:

"ఎవరికయినా అన్యాయం జరిగినపక్షంలో తప్ప మనిషి పరుష వచనాలు పలకడాన్ని అల్లాహ్ ఇష్టపడడు." (అన్ నిసా - 148)

అంటే, దౌర్జన్యానికి గురయిన వాళ్ళకి దౌర్జన్యపరుడికి వ్యతిరేకంగా గొంతెత్తి నిరసించే హక్కు కలదు.

# భావప్రకటనా స్వేచ్ఛ

నేటి కాలంలో భావప్రకటనా స్వేచ్ఛ (Freedom of Expression) అని చెప్పుకునే మరో విషయముంది. ఖుర్‌ఆన్ దాన్ని మరోవిధంగా ప్రకటిస్తుంది. నేటి నిర్వచనంతో పోల్చిచూస్తే ఖుర్‌ఆన్ ప్రతిపాదించే భావన ఎంత ఉన్నత మయిందో తెలియవస్తుంది. ఖుర్‌ఆన్ ప్రకారం-"మంచిని ఆజ్ఞాపించడం...." "చెడును వారించడం ..."-అన్నది మానవుని హక్కు మాత్రమే కాదు. అది అతడి విధి కూడాను. ఖుర్‌ఆన్ ఆదేశాల ప్రకారమున్నూ, హదీస్ బోధనల రీత్యానూ మంచి చేయమని ఇతరులకు చెప్పడం, చెడు నుంచి ప్రజలను వారించడం మనిషి విద్యుక్త ధర్మం.

ఏదైనా చెడు జరుగుతూ ఉంటే, దానికి వ్యతిరేకంగా ఘోషించడం మాత్రమే కాదు. ఆ చెడును ఆపడానికి ప్రయత్నం కూడా చేయాలి. పైగా చెడుకు వ్యతిరేకంగా నిరసన తెలుపకపోవడం, చెడును నిరోధించే ప్రయత్నం చేయకపోవడం అపరాధం. ఇస్లామీయ సమాజాన్ని పవిత్రంగా ఉంచడం ముస్లిముల బాధ్యత. ఈ విషయంలో ముస్లిముల గొంతును నొక్కే ప్రయత్నం జరిగితే అంతకన్నా పెద్ద పాపం మరొకటి లేదు. అలాగే ఎవరైనా మంచిని నిరోధిస్తే అతడు ఎదుటి వాని ప్రాథమిక హక్కును కబళించడమే కాక ఎదుటి వ్యక్తి బాధ్యత నిర్వహణను అడ్డుకొన్న వాడు కూడా అవుతాడు. సమాజంలో ఆరోగ్యకరమైన వాతావరణం మనగలగడానికి మనిషికి ఈ హక్కు ఎట్టి పరిస్థితిలోనూ లభ్యం కావాలి. ఖుర్‌ఆన్ బనీ ఇస్రాయీల్ పతనానికి కారణాలను విశదీకరించింది. అందులో ఈ కారణాన్నీ పేర్కొన్నది: "వాళ్ళు చెడులనుంచి ఒకరినొకరు నిరోధించేవారు కాదు." - అంటే ఏ జాతిలోనైనా ఈ పరిస్థితులు నెలకొంటే, చెడులకు వ్యతిరేకంగా మాట్లాడే వాళ్ళు కరవైతే, చివరికి క్రమేణా చెడులు సమాజం అంతటా వ్యాపించిపోతాయి. ఆ తరువాత ఆ సమాజం కుళ్ళిపోయిన పళ్ళబుట్టలా తయారవుతుంది. దాన్ని పారేయడం మాత్రమే

జరుగుతుంది. అలాంటి సమాజం దైవిక శిక్షకూ అర్హతపొందడంలో ఏ లోటూ మిగలదు.

## అంతరాత్మననుసరించి విశ్వాసం కలిగి ఉండే స్వేచ్ఛ

'ధర్మం విషయంలో బలాత్కారం లేదు' (బఖర:256) అనే సిద్ధాంతాన్ని మానవతకు ఇచ్చింది ఇస్లాం. ఈ నియమం ప్రకారం ప్రతి మనిషికి విశ్వాసాన్నిగాని, తిరస్కారాన్నిగాని ఏదైనా అనుసరించే స్వేచ్ఛ నిచ్చింది. బలప్రయోగం అన్నది ఇస్లాంలో కేవలం రెండు పరిస్థితులలో మాత్రమే సమ్మతం అవుతుంది. ఒకటి- ఇస్లామీయ రాజ్య ఉనికికోసం, భద్రతకోసం యుద్ధరంగంలో శత్రువులతో పోరాడవలసి రావడం. రెండు - శాంతిభద్రతలు, పరిపాలనా వ్యవస్థల రక్షణ కోసం, నేరాలను, ఉపద్రవాలను నిరోధించడానికిగాను న్యాయపరమైన, పాలనా పరమైన చర్యలు తీసుకోవడం.

ఇస్లాం ఆరంభంలోని పదమూడేళ్ళ కఠోర పరీక్షల మక్కాదశలో ముస్లింలు చిత్రహింసలను భరిస్తూ సత్యాన్ని ప్రకటించడం అంతరాత్మననుసరించి విశ్వాసాన్ని కలిగి ఉండే స్వేచ్ఛకు సంబంధించిన విలువయిన హక్కును పొందడానికే. చివరికి ఈ హక్కు వారికి లభించింది. ముస్లింలు ఈ హక్కును తాము పొందినట్లే ఇతరులూ ఈ హక్కు కలిగి ఉన్నారని సాదరంగా గుర్తించారు. ముస్లిములు తమ రాజ్యపరిధిలోని ముస్లిమేతర ప్రజలపై ఇస్లాం స్వీకరించేందుకు ఒత్తిడి చేసిన సంఘటన ఇస్లామీయ చరిత్రలో మచ్చుకు కూడా కానరాదు. లేదా ఏ జాతినైనా బలప్రయోగంతో ముస్లిములుగా మార్చినట్టు దాఖలాలు లేవు.

## మత విద్వేషం నుండి పరిరక్షణ

వివిధ మతవర్గాలు ఒకరినొకరు తూలనాడుకోవడాన్ని, ఎదుటి మత గురువులపై బురద చల్లుకోవడాన్ని ఇస్లాం సహించదు. ప్రతి మనిషి మత విశ్వాసాలను, వారి మతాచార్యులను గౌరవించడం నేర్పింది ఖుర్ఆన్. ఖుర్ఆన్

ఇలా బోధిస్తుంది: "అల్లాహ్‌ను కాదని వీరు ఎవరినయితే ఆరాధ్యులుగా ఎంచి మొరపెట్టుకుంటారో వారిని చెడుగా సంబోధించకండి." (ఖుర్ఆన్ 6:108)

అంటే, వివిధ మతాలు, మత విశ్వాసాలను గురించి హేతుబద్ధంగా చర్చించడం, సామంజస్యతతో విమర్శించడం లేదా విభేదించడం అన్నది భావప్రకటనా స్వేచ్ఛ పరిధిలోకి వస్తుంది. కాని దూషించడం, ఇతరుల్ని నొప్పించడానికి తూలనాడటం ఎంత మాత్రం సహించరానిది.

## సంఘాలు ఏర్పరచుకునే హక్కు

భావప్రకటనా స్వేచ్ఛకు సహేతుక పరిణామంగా సంఘం ఏర్పరచుకునే హక్కు ముందుకు వస్తుంది. అభిప్రాయభేదాలను మానవ జీవితంలోని ఓ కాదనజాలని వాస్తవమని ఖుర్ఆన్ అనేకమార్లు పేర్కొంది. ఒకే విధమైన అభిప్రాయాలు గల వాళ్ళు పరస్పరం సంఘటితమవడాన్ని నిరోధించడం సాధ్యమెలా అవుతుంది? ఒక సిద్ధాంతం, ఒక దృక్పథం ఆధారంగా ఉనికిలోకి వచ్చిన సమాజంలోనూ విభిన్న ఆలోచనా ధోరణులు ఉండవచ్చు. ఆ ఆలోచనా ధోరణులు గలవారు పరస్పరం సన్నిహితమవుతారు. ఖుర్ఆన్ ప్రకారం: "మీలో ఒక వర్గం ఉండాలి. అది మంచివైపునకు పిలువాలి. మంచిని ఆజ్ఞాపించాలి, చెడునుండి నిరోధించాలి." (ఆలి ఇమ్రాన్: 104)

ఇస్లామీయ సమాజంలోనూ ఆచరణాత్మకంగా మంచి, చెడుల సవివరమైన భావనల్లో భేదాభిప్రాయాలు తారసిల్లినప్పుడు ముస్లిం సమాజం ఒక్కటిగా ఉన్నప్పటికీ అందులో విభిన్న ఆలోచనా ధోరణులు గలవారు వర్గాలుగా ఏర్పడతారు. ఇది అభిలషణీయ విలువలకు ఎంత దిగువగా ఉన్నప్పటికీ వర్గాలు, పార్టీలు ఉనికిలోకి రాకమానవు. అందువల్లనే ఇస్లామీయ శాస్త్రాల నిర్వచనంలోనూ ధర్మశాస్త్రం, చట్టాలలోనూ, రాజకీయ దృక్పథాలలోనూ భేదాభిప్రాయాలు, వాటితో పాటు భిన్న వర్గాలు ఉనికిలోకి వచ్చాయి. ప్రశ్న ఏమిటంటే. ఇస్లామీయ సంవిధానంలోనూ ఇస్లాం ప్రతిపాదించే హక్కుల

జాబితాలోనూ విభిన్న అభిప్రాయాల వారికి సంఘాలుగా ఏర్పడే హక్కు ఉందా? ఈ ప్రశ్న ప్రప్రథమంగా హజ్రత్ అలి (రజి) సమక్షంలో ఖారిజీ వర్గం ఏర్పడ్డప్పుడు వచ్చింది. అలి(రజి) ఈ హక్కును గుర్తించారు. ఆయన ఖారిజీలతో "మీరు కత్తులు తీసుకుని మీ అభిప్రాయాలను బలవంతంగా ఇతరులపై రుద్దే ప్రయత్నం చేయనంత కాలం మీకు పూర్తి స్వేచ్ఛ ఉంటుంది." అన్నారు.

## మనిషిపై ఇతరుల ఆచరణల బాధ్యత రాకుండా భద్రత

ఇస్లాంలో మనిషి కేవలం తన ఆచరణలకు, తన అపరాధాలకు మాత్రమే జవాబు చెప్పుకోవలసి ఉంటుంది. ఇతరుల ఆచరణలు, అపరాధాలకు అతణ్ణి పట్టుకోవడం జరగదు. ఖుర్‌ఆన్ ప్రకారం:

"భారాన్ని మోసేవాడెవడూ ఇతరుల భారాన్ని మోయడానికి బాధ్యుడు కాడు." (6 : 63)

ఇస్లామీయ చట్టం ప్రకారం సుల్తాన్ చేసిన తప్పులకు సల్మాన్ పట్టుబడే అవకాశం లేదు.

## సందేహాల ఆధారంగా చర్యతీసుకునే వీలులేదు

ఇస్లాం ప్రకారం ప్రతి వ్యక్తికీ, తనకు వ్యతిరేకంగా నిరాధారమయిన చర్యతీసుకోకుండా రక్షణ ఉంటుంది. ఈ విషయమై ఖుర్‌ఆన్ స్పష్టంగా ఆదేశిస్తూంది: ఎవరిపైనయినా ఆరోపణలుంటే ఆరా తీయాలి. లేకపోతే తెలియకనే ఏ వర్గానికి వ్యతిరేకంగానయినా చర్య తీసుకొనే ప్రమాదం ఉంటుంది.★

---

★ ఇంకా, *"మీ వద్దకు ఎవడయినా పాపిష్ఠి వాడు ఏదయినా వార్తను తెచ్చినప్పుడు దాన్ని ధ్రువపరచుకోనంత వరకు ఏ చర్యనూ తీసుకోకండి." (49:6) అనే ఆయత్‌ను కూడా చూడండి.*

ఇంతేకాదు, ఖుర్‌ఆన్ ఇంకా ఇలా ఆదేశిస్తోంది:

"విశ్వాసులారా! అతిగా సందేహాలను పెంచుకోవడం మానివేయండి."

(49 : 12)

క్లుప్తంగా ఇవీ, ఇస్లాం మనుష్యులకు ప్రసాదించిన ప్రాథమిక మానవ హక్కులు. వీటి భావన సంపూర్ణమైనది, స్పష్టమైనదీను. వీటిని గురించి మానవ మనుగడ ప్రారంభంలోనే మనిషికి తెలియపరచడం జరిగింది.

ముఖ్య విషయమేమంటే, నేటికీ ఐక్యరాజ్యసమితి జారీచేసిన మానవ హక్కుల ప్రకటన (Declaration of Human Rights) వెనుక ఏ అధికారమూ లేదు, అమలు జరిపించే శక్తీ లేదు. ఓ ఉన్నత ప్రమాణాన్ని సూచించడం జరిగింది. అంతే. ఆ ప్రమాణాలను అమలు జరపాలన్న నిర్బంధం ఏ జాతిపైనా లేదు. మానవ హక్కుల ఈ ప్రకటన, సమస్త జాతులచేత అంగీకరింపజేసే ఏ ప్రభావవంతమైన ఒప్పందమూ ఇది కాదు. అయితే ముస్లింల వ్యవహారం వేరు. వారు, దైవగ్రంథం ఖుర్‌ఆన్ బోధనలకు, ప్రవక్త ముహమ్మద్ (సఅసం) నిర్దేశాలకు బద్ధులై ఉన్నారు. మనిషి ప్రాథమిక హక్కులను దైవం, దైవప్రవక్త (సఅసం) సంపూర్ణంగా విశదీకరించారు. ఇస్లామీయ రాజ్యంగా ఏర్పడగోరే రాజ్యం ఏదయినా ఈ హక్కులను దాని ప్రజలకు ఇవ్వక తప్పదు. ముస్లింలను, ముస్లిమేతరులకు అందరికీ ఈ హక్కులు ఇవ్వవలసి ఉంటుంది. ఏ జాతి అయినా ఈ విషయంలో, ముస్లిములకు ఈ హక్కుల్ని ఇస్తేనే ముస్లిములు కూడా వారికి ఈ హక్కులు ఇస్తామంటూ చేసుకునే ఎలాంటి ఒప్పందమూ అవసరం లేదు. వాస్తవానికి ముస్లిములు ఎట్టి పరిస్థితులలోనూ ఈ హక్కుల్ని ఇవ్వవలసి ఉంటుంది.

శత్రువులకైనా, మిత్రులకైనా అందరికీ ఈ హక్కులను ఇవ్వక తప్పదు.

- సమాప్తం -